నిధులు లేక నిలిచిన పనులు

- ఉపకేంద్రం నిర్మాణం పూర్తి ఎప్పుడో?
- ఇబ్బందుల్లో వైద్య సిబ్బంది, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పెగడపల్లి: ఆరవెల్లిలో నిలిచిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లిలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రాథమిక ఆరోగ్య పరిధిలో ఉన్న ఆరవెల్లిలో ఉప కేంద్రానికి పక్కా భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత మేరకు నిర్మాణ పనులు చేపట్టి చేసిన పనికి బిల్లు రాక మధ్యలోనే చేతులెత్తేశాడు. పనులు నిలిచిపోయి ఏడాది దాటినా అధికారులెవ్వరూ పట్టించు కోవడం లేదు. దీంతో వైద్య సిబ్బంది, ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్యోగ కేంద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో కొనసాగుతోంది. ఇక్కడ పల్లె దవాఖాన ఏర్పాటు చేసి ఓ డాక్టర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆరోగ్య సమస్యలున్న వివిధ రకాల వ్యాధిగ్రస్తుల తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. అందుకు తగిన వసతులు లేక వచ్చిపోయే రోగులతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం పనులు నిలిచిపోయిన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వెచ్చించిన నిధులు వృథాగా పోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



గ్రామంలో గర్భిణులు, బాలింతలు, సాధారణ వ్యాధి గ్రస్తులు ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. వారికి సరైన వసతులు లేక సిబ్బందితో పాటు వచ్చిపోయే ప్రజలు అవస్థలు పడుతున్నారు. పల్లె దవాఖానాకు నిర్మిస్తున్న పక్కా భవనం మధ్యలోనే నలిచిపోయింది. అధికారులు స్పందించి భవనం పూర్తి చేయించాలి.

– గోక శంకరయ్య ఆరవెల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాను



అర్ధాంతరంగా నిలిచిపోయిన పల్లె దవఖాన భవనం గురించి సంబంధిత అధి కారుల దృష్టికి తీసుకెళ్లా ను. కానీ భవన నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌కు చేసిన పనికి బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేశాడని అధికా రులు చెబుతున్నారు. అధికారులు చొరవచూపి భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ఉప్పులంచె లక్ష్మణ్, మాజీ సర్పంచ్, ఆరవెల్లి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సారె అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి



నాయికపు గూడెంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగిత్యాల: గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఉప్పరిపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, అప్పుడే తల్లిబిడ్డలు క్షేమంగా ఉంటారన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ జీవన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

గొల్లపల్లి: పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా పోషణమాసం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రామిరెడ్డి, వైద్యాధికారి నరేశ్, హెల్త్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కూరగాయలతో రక్తహీనతకు చెక్

సారంగాపూర్: కూరగాయలు, ఆకుకూరలు సమృద్ధిగా తీసుకుంటే శరీరంలో రక్తహీనతను అరికట్టవచ్చని తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో సీహెచ్.గంగాధర్ అన్నారు. మండలంలోని నాయికపుగూడెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు, కిషోరబాలికలకు రక్తహీనత కారణంగా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఈ సమస్య రాకుండా తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శశికుమార్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం రాజయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లత, శైలజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక ప్రతినిధులు

కథలాపూర్: రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతు ఐక్యవేదిక జిల్లా ప్రతినిధులు బద్దం మహేందర్‌రెడ్డి, పూండ్ర జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు.మండలకేంద్రంలో సోమవారం మాట్లాడారు. రుణమాఫీ పథకం ప్రారంభంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సందడి చేశారని, రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలన్నారు. వానాకాలం పంటలు చేతికొస్తున్నాయని, ఇప్పటికి రైతుభరోసా డబ్బులకు దిక్కులేదన్నారు. రైతులను ఊరించి మోసం చేస్తుందని ప్రభుత్వం తీరుపై దుయ్యబట్టారు. రైతులు రుణమాఫీ కోసం అధికారుల, బ్యాంకుల చుట్టూ తిరిగిన సరైన సమాధానం రావడంలేదని, ఈ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లోక శశిధర్‌రెడ్డి, కొండ ఆంజనేయులు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, శనిగారపు గణేశ్, రవినాయక్, ప్రిన్స్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న అనంతరెడ్డి

జగిత్యాల: 'ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్నా, ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. ప్రభుత్వ స్కూళ్లతో పాటు, అన్ని సమస్యలు పరిష్కరిస్తాను' అని ట్రస్మా చీఫ్ అడ్వైజర్ కడారి అనంతరెడ్డి అన్నారు. సోమవారం కేజీఆర్ స్కూల్‌లో మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని వసతులున్నాయని, బిల్డింగ్‌లు శిథిలావస్థకు చేరాయని, వాటిని అభివృద్ధి చేసేలా కృషి చేస్తానన్నారు. ట్రస్మా మద్దతుతో బీజేపీ అవకాశం ఇస్తే బీజేపీ నుంచి లేదా ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని, 317 జీవోపై గళం విప్పుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నర్సిరెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లక్ష్మీపూర్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, రీజినల్ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఐ దివ్యారాణి, ప్రత్యేకాధికారి రవిబాబు, ఏపీఎం గంగాధర్, ఎఫ్ఎల్‌సీ మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కోరుట్ల: పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ,బలిజ పద్మా రాజరెడ్డి సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగ్రమధుసూదన్‌రావు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

- ఐటీఎంబీ స్కూల్ మేనేజర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్

జగిత్యాల: ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ మార్కెటింగ్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఐటీఎంబీ స్కూల్ మేనేజర్ డాక్టర్ కృష్ణ మోహన్ అన్నారు. సోమవారం ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్‌లో ఉద్యోగం సాధించాలంటే స్కిల్స్ తప్పనిసరి అని వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థచైర్మన్ యాద రామకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపల్ మునీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల, కాచారాం గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. పోరుమల్లలో పరిపెల్లి రణదీప్‌రెడ్డి, ఏలేటి గంగారెడ్డి, జంబుక చిన్నమ్మ కుటుంబాలను, కాచారంలో చిట్యాల గంగు, కొప్పెరా రాంరెడ్డి, ఒడ్డవేని రాజం కుటుంబాలను, భీమారంలో చెక్కపల్లి శంకర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, మాదం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో..

మల్యాల: మండల కేంద్రానికి చెందిన వంగల మహిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, మ్యాక లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు మంజూరు చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: వృద్ధాప్య, బీడీ, వితంతు పింఛన్లను మంజూరు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన 20 మంది మహిళలు తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్‌కు విన్నవించారు. కొత్త పింఛన్లు మంజూరు కాగానే అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేస్తామని మహిళలకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎవో రాజ్‌కుమార్, ఏపీఎం శంకర్, ఇరిగేషన్ ఎఈ సుకన్య, ఎంఐఎస్ కార్తీక్, ఫిషరిష్ ఫీల్డ్‌మాన్ గంగాధర్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న గోపాల్‌రెడ్డి

కథలాపూర్: ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో 200 మందిని పార్టీ సభ్యత్వం చేయించడమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో ఇప్పటికే 2 వేల మంది సభ్యత్వం తీసుకున్నారని, రానున్న రోజుల్లో 8 వేల మందిని సభ్యత్వం చేయించాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు పూండ్ర ప్రతాప్‌రెడ్డి, తుమ్మనపెల్లి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోటళ్లలో మున్సిపల్ సిబ్బంది తనిఖీ



కిచెన్‌లో పదార్థాలు పరిశీలిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణ శివారులో ఉన్న ఓ రెస్టారెంట్‌తో పాటు రెండు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సోమవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కిచెన్‌తో పాటు పదార్థాల తయారీకి వినియోగిస్తున్న సరుకులను పరిశీలించారు. మూడు చోట్ల పరిశుభ్రత పాటించడం లేదని గుర్తించి..రెస్టారెంట్‌కు రూ.2వేలు, మిగతా రెండు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. పరిశుభ్రతతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ఇతర సిబ్బంది ముజీబ్, నిజాం, నాయక్ ఉన్నారు.

సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

జగిత్యాలరూరల్: తమిళనాడులోని చెంగపట్నంలో ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగిన సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీల్లో మండలంలోని లక్ష్మీపూర్ ప్రజ్ఞ గ్లోబల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల చైర్మన్ అనిల్ తెలిపారు. విద్యార్థులు హేమ, హాసిని సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దుగ్యాల రాఘవ్, సాకేత్, సాయిమణి, హనీశ్ బాక్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు. వీరిని సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ అనిల్, ఇన్‌చార్జి రాజశేఖర్, పీఈటీలు శ్రీకాంత్, మనోజ్, బాక్సింగ్ కోచ్ వంశీకృష్ణ అభినందించారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: కండ్లపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డును వెంటనే నిర్మించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కండ్లపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో రైతు చౌరస్తా వద్ద రోడ్డు చెడిపోవడంతో వర్షం నీరు చేరి బురదగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జగిత్యాల-రాయికల్-నిర్మల్ వెళ్లే దారిలో అత్యధిక సంఖ్యలో వాహనాలు వెళ్తాయని, రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్, ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్, నాయకులు పాల్గొన్నారు.

పొలాల పరిశీలన



పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి నాగమణి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో సుడి దోమ ఉధృతికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు షమీనా, నరేశ్, శ్రీహరి, రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు,

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లోని వరి పొలాలను ఏవో యోగితా సోమవారం పరిశీలించారు. ప్రస్తుత వాతావరణం పరిస్థితుల్లో వరి పొలాలకు ఎండుతెగుళ్ల సోకుతుందని రైతులు చెప్పడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఆమె పేర్కొన్నారు. సుడిదోమ ఆశించే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సంధ్య, శేఖర్, హరీశ్, సుష్మా, రైతులు పాల్గొన్నారు.



సారంగాపూర్: ప్రభుత్వాలు హరితహారం, వనమహోత్సవాల పేరుతో ప్రతీ సంవత్సరం మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయం ప్రహరీని ఆనుకుని కార్యాలయ ఆవరణలో 15 ఏళ్ల కింద నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. ఇవి ప్రహరీ గోడలను ఆనుకుని నాటడంతో లక్షల రూపాయల విలువ చేసే ప్రహరీలు పగుళ్లు చూపి, వేర్లు పునాదుల్లోకి పోయి గోడలు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. గోడలను కాపాడడానికి వృక్షాలుగా మారిన చెట్లను తొలగించి, ప్రహరీ గోడకు కొద్ది దూరంలో మొక్కలు నాటాలని ప్రజలు పేర్కొంటున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
సీహెచ్ గంగాధర్, ఎంపీడీవో, సారంగాపూర్, సెల్ నంబర్: 9440468508

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం 27వ వార్డుకు చెందిన ముక్సాద్ అలీకి రూ.60 వేల విలువ గల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షకీల్, కత్తురోజు గిరి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డ్రైవర్ల పాత్ర కీలకం

జగిత్యాల: మున్సిపల్ చెత్త సేకరణలో డ్రైవర్ల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. ఇటీవల డ్రైవర్ల యూనియన్ ఏర్పాటు చేసుకోగా సోమవారం చైర్‌పర్సన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని, పట్టణంలో పారిశుధ్య సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేణు

మెట్‌పల్లి: తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వంగ వేణును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ సోమవారం తెలిపారు. తొందరలోనే మండల కమిటీలను నియమించి.. జిల్లాలో బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మేడిపల్లి: మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, ఆటల పోటీల్లో భీమారం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాల్లో గెలుపొందినట్లు పీఈటీ పెసరి తిరుమలేశ్ తెలిపారు. అథ్లెటిక్స్‌లో అక్షిత లాంగ్‌జంప్‌లో మొదటిస్థానం, మందుల మానుశ్రీ ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం, బండపల్లి అభిషేక్ ఐదు విభాగాల్లో మొదటిస్థానంలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం జవ్వాజి అశోక్ , సాదుల ప్రసాద్, నరుకుల శ్రీధర్, నజీమా, సాహెభా, అప్సర్, నరేందర్ పాల్గొన్నారు.

తక్కళ్లపెల్లిలో పురావస్తు శాఖ అధికారుల పర్యటన

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలో సోమవారం పురావస్తుశాఖ అధికారి రవితేజ, సిబ్బంది పర్యటించారు. గ్రామశివారులోని పురాతన భోగేశ్వరస్వామి ఆలయంను సందర్శించారు. దేవాలయ చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. భోగేశ్వరస్వామి దేవాలయ భూములు కబ్జాకు గురైనట్లు గ్రామస్తులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఇటీవలే ఫిర్యాదు చేశారు. దీంతో పురావస్తుశాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు పేర్కొన్నారు.

గీత కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

జగిత్యాలక్రైం: గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కుతున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎక్సైజ్ సీఐ రాజమౌళి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో గీత కార్మికులకు సేఫ్టీ మోకులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటిచెట్లు ఎక్కుతున్న సమయంలో నాణ్యతగా ఉన్న మోకులను వినియోగించాలని, సేఫ్టీ ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తల వల్ల ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సునీత, ట్రైనర్ గీత పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుంకరి రవి తెలిపారు. పీజీటీ ఫిజిక్స్-1,పీజీటీ తెలుగు-1,టీజీటీ హిందీ-1 ఖాళీలు కాగా పీజీటీ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో బీఎడ్ పాసై ఉండాలని టీజీటీ అభ్యర్థులు టెట్ పాసై ఉండాలని, దరఖాస్తులకు చివరి తేదీ 25 కాగా, ఇంటర్వ్యూ,డెమో 26 నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంలో నాలుగు గొర్రెలు మృతి

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన ఎట్టెం మల్లేశంకు చెందిన నాలుగు గొర్రెలు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి యాదవ రైతును ఆదుకోవాలనిరైతు సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్ యాదవ్ కోరారు.

విద్యా వలంటరీ వ్యవస్థను పునరుద్ధరించాలి

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం టీఆర్టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రేషనలైజేషన్ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్న ఉత్తర్వుల మేరకు కనీసం ఇద్దరు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు, కన్వీనర్ దాసరి బీమయ్య, మండల అధ్యక్షుడు బండారి సతీష్, కాసర్ల వెంకటరమణ, రమేశ్ పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఖాతా కేటాయించాలి

జగిత్యాల: జీపీఎఫ్ ఖాతా కేటాయించాలని పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. సోమవారం జెడ్పీ సీఈవోకు వినతిపత్రం అందించారు. హిందీ పండిట్‌కు 2002 నుంచి సర్వీస్ వర్తింపు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, వీరంతా పాత పెన్షన్ పరిధిలోకి వస్తారని, వీరికి జీపీఎఫ్ ఖాతా నంబరు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశంగౌడ్, నర్సయ్య పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన కరీంనగర్‌కు చెందిన కొరవేని పెద్దిరాజును కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ 8 రోజుల జైలుశిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం మాట్లాడుతూ ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. వాహనదారులు వాహనానికి ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలన్నారు.